



# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

EVENING EDITION

www.suryaa.com పేజీలు: 02 4PM



## హింసాయుత ఘటన.. 52 మంది మృతి



ఈశాన్య ఆఫ్రికాలోని సూడాన్‌లో హింసాయుత ఘటనలు చోటుచేసు కున్నాయి. ఈ దాడుల్లో 52 మంది మృతి చెందగా.. 64 మంది గాయపడ్డారు. మృతుల్లో ఐక్యరాజ్యసమితి ప్రాంతీయ అధికారి కూడా ఉన్నారు. అయితే హింసాయుత ఘటనలకు గల కారణాలుపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ హింసకు పాల్పడినవారు న్యూర్ తెగకు చెందినవారని తెలుస్తోంది.

బంగారం ధర ₹63,050 10 GRMS 24 CARAT

వెండి ధర 1KG 77,700



సెన్సెక్స్ 71,728 (1042)

నిఫ్టి 21,681 (329)

చికెన్ ధర 1KG ₹260

గుడ్ల ధరలు డజన్ ₹68

## జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసానికి ఈడీ అధికారులు



దేశ రాజధాని ఢిల్లీలోని జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ అధికార నివాసానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు చేరుకున్నారు. మనీ లాండరింగ్ కేసులో విచారణను ఎదుర్కొంటున్న సోరెన్‌కు ఈ నెల 27న ఈడీ తొమ్మిదోసారి నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. మరోసారి ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయాల్సి ఉందని.. జనవరి 29 లేదా 31 తేదీల్లో అందుబాటులో ఉండాలని అందులో పేర్కొన్నది. ఈ రెండు రోజుల్లో ఒకదానిని ఎంచుకోవాలని సూచించింది. అయితే ఈడీ నోటీసులకు సోరెన్ ఇప్పటివరకు స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని ఆయన అధికార నివాసానికి అధికారులు చేరుకున్నారు. మనీలాండరింగ్ కేసులో సీఎం సోరెన్‌ను రాంచీలోని అధికార నివాసంలో ఈడీ అధికారులు ఈ నెల 20న సుదీర్ఘంగా ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. జార్ఖండ్‌లో భూమి యాజమాన్యాన్ని అక్రమంగా మార్చే భారీ మాఫియాకు సంబంధించిన స్కామ్‌పై ఈడీ దర్యాప్తు చేస్తున్నది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే 14 మందిని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. 2011 బ్యాచ్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా, రాంచీ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన రంజన్‌ను కూడా ఈ కేసులో అరెస్ట్ చేశారు.



## అట్టహాసంగా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ వేడుక..

### ఉత్తమ నటీనటులుగా అలియా-రణ్‌బీర్ జంట

బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ 2024 జాబితా విడుదలైంది. 69వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక ఆదివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. గుజరాత్‌లోని గాంధీ నగర్‌లో జరిగిన ఈ వేడుకలో అవార్డ్స్ జాబితాను ప్రకటించారు. 2023లో విడుదలైన చిత్రాలకు సంబంధించి విజేతలను ప్రకటించారు. ఈ జాబితాలో ఇటీవలే విడుదలై ఘన విజయం సాధించిన 12th ఫెయిల్ (12th Fail) ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఎలాంటి అంచనాలూ లేకుండా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపిన విషయం తెలిసిందే. ఈ చిత్ర దర్శకుడు విధు వినోద్ చోప్రా బెస్ట్ డైరెక్టర్ అవార్డున సొంతం చేసుకున్నాడు. ఇక బాలీవుడ్ స్టార్స్ రణ్‌బీర్ కపూర్ (Ranbir Kapoor), అలియాభట్ (Alia Bhatt) జంట ఉత్తమ నటుడు, నటి అవార్డులు గెలుచుకోవడం విశేషం. యానిమల్ చిత్రానికి గానూ రణ్‌బీర్ కపూర్‌కు ఉత్తమ నటుడు అవార్డు వరించింది. రాఖీ ఔర్ రాణీకీ ప్రేమ్ కహానీ చిత్రానికి గానూ అలియాభట్ ఉత్తమ నటిగా ఎంపికైంది. ఇక ఉత్తమ సహాయ నటుడిగా విక్కీ కౌశల్ (డంకీ), ఉత్తమ సహాయ నటిగా షబానా అజ్మీ (రాఖీ ఔర్ రాణీకీ ప్రేమ్ కహానీ) ఎంపికయ్యారు.

### 69వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల జాబితా

**ఉత్తమ చిత్రం :** 12th ఫెయిల్

**ఉత్తమ చిత్రం (క్రిటిక్స్) :** జొరామ్

**ఉత్తమ నటుడు :** రణ్‌బీర్ కపూర్ (యానిమల్)

**ఉత్తమ నటుడు (క్రిటిక్స్) :** విక్రాంత్ మెస్సె (12th ఫెయిల్)

**ఉత్తమ నటి :** అలియాభట్ (రాఖీ ఔర్ రాణీకీ ప్రేమ్ కహానీ)

**ఉత్తమ నటి (క్రిటిక్స్):** రాణీ ముఖర్జీ (మిస్సెస్ ఛటర్జీ Vs నార్వే), షఫాలీ షా (త్రీ ఆఫ్ అజ్)

**ఉత్తమ సహాయ నటుడు :** విక్కీ కౌశల్ (డంకీ)

**ఉత్తమ సహాయ నటి :** షబానా అజ్మీ (రాఖీ ఔర్ రాణీకీ ప్రేమ్ కహానీ)

**ఉత్తమ గీత రచయిత :** అమితాబ్ భట్టాచార్య (తెరె వాస్తే..: జరా హత్కే జరా బచ్చే)

**ఉత్తమ మ్యూజిక్ ఆల్బం :** యానిమల్

**ఉత్తమ నేపథ్య గాయకుడు :** భూపిందర్ బాబర్ (అర్జన్ వెయిలీ – యానిమల్)

**ఉత్తమ నేపథ్య గాయకురాలు :** శిల్పా రావు (చెలెయ్ – జవాన్)

**ఉత్తమ కథ :** అమిత్ రాయ్ (OMG 2)

**ఉత్తమ స్క్రీన్‌ప్లే :** విధు వినోద్ చోప్రా (12th ఫెయిల్)

**ఉత్తమ డైలాగ్ :** ఇషితా మొయిత్రా (రాఖీ ఔర్ రాణీకీ ప్రేమ్ కహానీ)

**బెస్ట్ బ్యాగ్రౌండ్ స్కోర్ :** హర్షవర్ధన్ రామేశ్వర్ (యానిమల్)

**బెస్ట్ సినిమాటోగ్రఫీ :** అవినాష్ అరుణ్ దావరే (త్రీ ఆఫ్ అజ్)

**బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ :** సుబ్రతా చక్రవర్తి, అమిత్ రే (సామ్ బహదూర్)

**బెస్ట్ ఎడిటింగ్ :** జస్కున్వర్ సింగ్ కోహ్లీ- విధు వినోద్ చోప్రా (12th ఫెయిల్)

**బెస్ట్ కాస్ట్యూమ్ డిజైన్:** సచిన్ లవ్లేకర్, దివ్యా గంభీర్, నిధి గంభీర్ (సామ్ బహదూర్)

**బెస్ట్ సౌండ్ డిజైన్:** కునాల్ శర్మ (Mpse) (సామ్ బహదూర్), సింక్ సినిమా (యానిమల్)

**బెస్ట్ కొరియోగ్రఫీ:** గణేష్ ఆచార్య (వాట్ జుమ్కా?- రాఖీ ఔర్ రాణీకీ ప్రేమ్ కహానీ)

**బెస్ట్ యాక్షన్ :** స్పిరో రజాటోస్, అన్ల్ అరసు, క్రెయిగ్ మాక్రే, యాన్నిక్ బెన్, కెచా ఖంఫక్డీ, సునీల్ రోడ్రిగ్స్ (జవాన్)

**బెస్ట్ వీఎఫ్ఎక్స్ :** రెడ్ చిల్లీస్ Vfx (జవాన్)

**బెస్ట్ డెబ్యూట్ డైరెక్టర్:** తరుణ్ దూదేజా (ధక్ ధక్)

**బెస్ట్ డెబ్యూ మేల్:** ఆదిత్య రావల్ (ఫరాజ్)

**బెస్ట్ డెబ్యూ ఫీమేల్:** అలిజె అగ్నిహోత్రి (ఫారీ)

**లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు:** డేవిడ్ ధావన్




## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:31 గంటల సమయంలో సెన్సెక్స్ 610 పాయింట్లు లాభపడి 71,307 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 192 పాయింట్లు పెరిగి 21,543 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.15 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో సన్‌ఫార్మా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్, రిలయన్స్, విప్రో, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ, ఇన్ఫోసిస్, ఎంఅండ్‌ఎం షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

## ఆశలన్నీ 6 అంశాల మీదే..! బడ్జెట్‌పై పెరుగుతున్న అంచనాలు

ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్ వెల్లడించనున్నారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా 2024-25 ఆర్థిక బడ్జెట్‌లో పెద్ద ప్రకటనలు ఏమీ ఉండవని తెలుస్తోంది. అయితే బడ్జెట్ ప్రకటించడానికి ముందే అంచనాలు పెరుగుతున్నాయి. మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ లిమిటెడ్ డైరెక్టర్ గుర్మీత్ సింగ్ చావ్లా.. ప్రభుత్వం ప్రధానంగా ఆరు అంశాల మీద దృష్టి సారించే అవకాశం ఉందని వెల్లడించారు.



- 2024 బడ్జెట్‌లో డిజిటలైజ్డ్ ఇండియా, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వెహికల్స్ (EVలు), బ్రాడ్‌బ్యాండ్ వృద్ధిని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెగ్మెంట్‌కు ఎక్కువ నిధులు కేటాయించే సూచనలు ఉన్నాయి.
- ప్రభుత్వం సంక్షేమ వ్యయాన్ని పెంచడానికి సిద్ధంగా ఉందని, 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి ఆర్థిక లోటును GDPలో 4.5 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.
- కాపెక్స్‌పై దృష్టి సారిస్తూనే ప్రభుత్వం పన్నులను తగ్గించడానికి & వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాలకు మద్దతునిచ్చే ప్రణాళికలను ప్రకటించే అవకాశం ఉంది. ప్రపంచ వృద్ధి ఆందోళనలను అధిగమించడానికి క్యాపెక్స్‌పై ప్రభుత్వ వ్యయం పెరుగుతుందని భావిస్తున్నారు.
- రాబోయే ఆర్థిక సంవత్సరానికి, ఆహారం, ఎరువుల సబ్సిడీల కోసం భారతదేశం దాదాపు రూ. 4 ట్రిలియన్లు (48 బిలియన్ డాలర్లు) కేటాయించాలని యోచిస్తున్నట్లు సమాచారం.
- వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ కోసం 26.52 బిలియన్ డాలర్ల ఆహార సబ్సిడీ వ్యయాన్ని అంచనా వేయనుంది. ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే 10 శాతం లేదా 24.11 బిలియన్ డాలర్లు ఎక్కువని తెలుస్తోంది.
- గృహాల కోసం ప్రభుత్వం డబ్బును (నిధులు) 15 శాతం కంటే ఎక్కువ పెంచే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పెరుగుదల 2024-2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 1 ట్రిలియన్ డాలర్లకు (12 బిలియన్ డాలర్లకు సమానం) చేరుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.



## మిర్యాలగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

మిర్యాలగూడ వద్ద ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారును గుర్తు తెలియని లారీ ఢీకొన్న ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, మహిళ ఉన్నారు. నార్కట్‌పల్లి-అద్దంకి హైవేపై మిర్యాలగూడ పట్టణ పరిధిలోని కృష్ణానగర్ కాలనీ వద్ద అర్ధరాత్రి 12.10 నిమిషాల సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.

**తీర్థయాత్రలకు వెళ్లి వస్తుండగా..**

మిర్యాలగూడ మండలం నందిపాడుకు చెందిన చెరుపల్లి చెరుపల్లి మహేష్ హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటూ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. మూడురోజుల క్రితం అతని కుటుంబంతో పాటు బంధువులు కొందరు కలిసి కారులో తీర్థయాత్రలకు వెళ్లారు. యాత్ర ముగించుకుని ఆదివారం రాత్రి గుంటూరు వైపు నుంచి ఇంటికి తిరిగి వస్తూ మరో ఐదు నిమిషాల్లో ఇల్లు చేరతారనగా ప్రమాదం చోటు చేసుకుంది. నిద్రమత్తులో ఉండి డ్రైవింగ్ చేస్తుండగా కారు డివైడర్ దాటి రావడంతో అటుగా వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్ (32), అతని భార్య చెరుపల్లి జ్యోతి (30), కుమార్తె రిషిక (6), మహేష్ షడ్డకుడు బొమ్మ మహేందర్ (38), అతని కుమారుడు లియాన్ష్ (2) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మహేందర్ భార్య మాధవిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మహేందర్‌ది యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి అని తెలిసింది. మృతదేహాలను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## వైఎస్ షర్మిలతో వివేకా కుమార్తె సునీత భేటీ

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె సునీత ఇడుపులపాయలో భేటీ అయ్యారు. ఆమె కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారం దృష్ట్యా ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు చేపట్టిన అనంతరం సునీత ఆమెను కలవడం ఇదే తొలిసారి. ఈ భేటీలో సునీత రాజకీయ ప్రవేశంపై చర్చ జరిగినట్లు సమాచారం. దీనిపై సునీత సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నారు. ఇది చేస్తూనే తన తండ్రిని హత్య చేసిన వ్యక్తులను రాజకీయంగా ఎదుర్కోవాలని సునీత భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇడుపులపాయ ఎస్టేట్‌కు




వచ్చిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా షర్మిలతో భేటీ అయ్యారు.

## కుప్పకూలిన విమానం.. ఏడుగురి మృతి

బ్రెజిల్‌లో ఓ చిన్న విమానం కుప్పకూలిన ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. మినాస్ గెరైస్ రాష్ట్రంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. సావోపాలో రాష్ట్రంలోని క్యాంపినాస్ నగరం నుంచి బయల్దేరిన కాసేపటికే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానిక పోలీసులు వెల్లడించారు. గాల్లో ఉండగానే విమానం ముక్కలై కుప్పకూలిందని తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అందులో ఉన్న ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి గల కారణం తెలియాల్సి ఉంది.



## హరియాణా అసెంబ్లీకి ఒంటరిగానే ఆప్



హరియాణలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాల్లో ఆప్ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని ఆ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఇండియా కూటమిలో భాగస్వామిగానే ఉంటామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్-మేలో, హరియాణా అసెంబ్లీ ఎన్నికలు అక్టోబర్‌లో జరిగే అవకాశాలున్నాయి. హరియాణాలోని జింద్‌లో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో కేజ్రీవాల్ పై నిర్ణయం ప్రకటించారు. 'హరియాణ ప్రజలిప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీని మాత్రమే నమ్ముతున్నారు. పంజాబ్, ఢిల్లీల్లో ఆప్ ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో అక్కడి ప్రజలు సంతోషంగా ఉన్నారు. అందుకే, ఈ రాష్ట్ర ప్రజలు కూడా మార్పును కోరుతున్నారు. ఆప్‌కే అధికార మివ్వాలని భావిస్తున్నారు'అని కేజ్రీవాల్ చెప్పారు. రాష్ట్రాన్ని పాలించిన పార్టీల పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ఆయా పార్టీల నేతలు తమ జేబులనే నింపుకున్నారని ఆరోపించారు.



## నేడు బీహార్‌లోకి ప్రవేశించనున్న రాహుల్ భారత్ జోడో న్యాయ్ యాత్ర

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర నేడు బీహార్‌లోకి ప్రవేశించనుంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన మరుసటి రోజే ఆయన బీహార్‌కు రానుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ఆర్జేడీ, కాంగ్రెస్, జేడీఎస్ ఆధ్వర్యంలోని మహాఘట్‌బంధన్ కూటమి నుంచి సీఎం నితీశ్ కుమార్ ఆదివారం వెలుపలికి వచ్చిన విషయం తెలిసిందే. బీజేపీతో మరోసారి చేతులుకలిపిన ఆయన కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించిన రాహుల్.. ఆ తర్వాత రాష్ట్రానికి రావడం ఇదే మొదటిసారి. సోమవారం మధ్యాహ్నం కిషన్‌గంజ్ మీదుగా జోడో యాత్ర బీహార్‌లోకి ప్రవేశిస్తుంది. ముస్లిం జనాభా అధికంగా ఉన్న ఆ జిల్లా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్నది. భారీ ర్యాలీ అనంతరం ఈ రోజు సాయంత్రం నిర్వహించనున్న బహిరంగ సభలో రాహుల్ మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో తాజా రాజకీయ పరిణామాలపై ఆయన ఏవిధంగా స్పందిస్తారనే విషయమై చర్చ నడుస్తున్నది.


## డ్రోన్ ఎటాక్.. ముగ్గురు అమెరికా సైనికులు మృతి

పశ్చిమాసియాలోని జోర్డన్‌లో జరిగిన డ్రోన్ దాడిలో అమెరికా బలగాలకు చెందిన ముగ్గురు సైనికులు మృతి చెందారు. సుమారు 25 మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ధ్రువీకరించారు. 'డ్రోన్ దాడి ఘటనకు సంబంధించి పూర్తి సమాచారం సేకరిస్తున్నాం. ఇరాన్ ప్రోత్సాహంతో ఇరాక్, సిరియా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రాడికల్ గ్రూప్‌లు ఈ దాడికి పాల్పడ్డాయి' అని పేర్కొన్నారు.



# మహిళ కిడ్నాప్‌లో ఐరాస ఏజెన్సీ సిబ్బంది

అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిలో ...స ఏజెన్సీ 'యూఎన్ఆర్‌డబ్ల్యూ ఏ' సిబ్బంది పాత్రపై ...న్ని ఆధారాలు బయటకు వచ్చాయి. అమెరికా ప్రభు ...నికి అందించిన డోసియర్ వివరాలను న్యూయార్క్ ... ప్రచురించింది. ఖాన్‌యూనిస్‌లో ఆ ఏజెన్సీ స్కూల్ ...లర్, అతడి కుమారుడు కలిసి ఇజ్రాయెల్ మహిళను ...హరించినట్లు దీనిలో పేర్కొంది. 'ఇజ్రాయెల్ సైనికుడి ...తదేహాన్ని గాజాకు తరలించడానికి నుసైరాత్‌కు ...దిన ఓ సామాజిక కార్యకర్త పని చేశాడు. అంతేకాదు.. ... రోజున మందుగుండు సరఫరా.. వాహనాల మధ్య ...న్వయ బాధ్యతలను చూశాడు. 97 మంది ప్రాణాలను బలిగొన్న బేరీ కిబుట్జ్ నరమేధంలో మరో ఉద్యోగి పాల్గొన్నాడు" అని తెలిపింది. ఈ డోసియర్‌లో 12 మంది ఉద్యోగుల వివరాలు, 'యూఎన్ఆర్‌డబ్ల్యూ ఏ'లో వారి హోదాలను ఇజ్రాయెల్ తెలిపింది. ఈ సంస్థలోని 10 మంది ఉద్యోగులు హమాస్ సభ్యులని, మరొకరు పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్‌కు చెందిన వ్యక్తని వెల్లడించింది. ఫోన్‌కాల్స్, టెక్ట్స్ మెసేజ్‌ల ఆధారంగా ఈ సమాచారం సంపాదించింది. ఈ ఏజెన్సీ పాలస్తీనా శరణార్థి శిబిరాల్లో లక్షల మందికి సేవలు అందిస్తోంది. దీనికి వేల మంది సిబ్బంది ఉన్నారు. ప్రధానంగా ఆహారం, నీరు వంటివి సరఫరా చేస్తుంటుంది. కొన్నేళ్ల నుంచి ఈ సంస్థ హమాస్‌తో కలిసి పనిచేస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ సంస్థ కేంద్రాలు, సామగ్రిని హమాస్ సాయుధ పోరాటం కోసం వాడుతోందని చెబుతోంది. దీని సిబ్బంది దాడిలో పాల్గొన్న విషయం బయటకు రాగానే ఐరాస అప్రమత్తమైంది. 12 మంది ఉద్యోగులను తొలగించింది. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, ఇటలీ దేశాలు ఈ సంస్థకు నిధులను నిలిపివేశాయి. తాజా ఆరోపణలపై ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ స్పందించారు. ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.



# అలాంటి సీన్స్‌లో నటిస్తా..

'యానిమల్' చిత్రంలో జోయాగా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు కథానాయిక త్రిప్తి డిమ్రీ. ఈ సినిమాతో ఒక్కసారిగా పాపులర్ అయిపోయిందీ అమ్మడు. 'యానిమల్' తర్వాత ఈ ఢిల్లీ భామకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ సంఖ్య అమాంతం పెరిగిపోయింది. రణబీర్ కపూర్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రంలో రష్మిక కథానాయిక కాగా, త్రిప్తి డిమ్రీ జోయా పాత్రలో అలరించింది.తాజాగా ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న త్రిప్తి 'యానిమల్' విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ తన కెరీర్ గురించి చెప్పుకొచ్చింది. 'సినీ పరిశ్రమలో ప్రయాణం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎత్తుపల్లాలు సహజం. ప్రతి దాని నుంచీ పాఠాలు నేర్చుకోవాలి. నా కెరీర్ విషయంలో ఎప్పుడూ బాధపడలేదు. 'యానిమల్'తో నాకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ సినిమా సూపర్ హిట్ అని ముందే ఊహించా. కాకపోతే నా పాత్రకు ఇంతటి పాపులారిటీ వస్తుందని అస్సలు అనుకోలేదు.





# పెళ్లిపీటలెక్కనున్న రకుల్ ప్రీత్ సింగ్

ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ త్వరలోనే పెళ్లిపీటలెక్కనుందా? ప్రియుడితో కలిసి ఏడడుగులు నడిచేందుకు ముహూర్తం ఫిక్స్ అయ్యిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది బాలీవుడ్ మీడియా సర్కిళ్లలో. ప్రముఖ బాలీవుడ్ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీతో చాలా కాలంగా ప్రేమలో మునిగి తేలుతోంది రకుల్. ఇప్పటికే బహిరంగంగా తమ ప్రేమ విషయాన్ని ప్రకటించారు రకుల్- జాకీ. సినిమా పార్టీలు, ఈవెంట్లు, ఫంక్షన్లలోనూ జంటగానే కనిపిస్తున్నారు లవ్లీ కపుల్. అయితే త్వరలోనే తమ బంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే పనిలో ఉన్నారట ఈ ప్రేమ పక్షులు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న గోవాలోని ఓ ప్రముఖ రిసార్ట్‌లో రకుల్- జాకీ భగ్నానీల వివాహం జరగనుందంటూ కొన్ని ఇంగ్లిష్ వెబ్ సైట్స్‌లో కథనాలు వస్తున్నాయి. కేవలం కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితుల సమక్షంలో ఈ వివాహ వేడుక జరగనుందట. ఆ తర్వాత సినీ, రాజకీయ ప్రముఖుల కోసం ప్రత్యేకంగా రిసెప్షన్, విందు పార్టీలు ఏర్పాటు చేయనున్నారట. ప్రస్తుతం రకుల్ పెళ్లి వార్తలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

# దమ్ముంటే నాపై పోటీ చెయ్

## చంద్రబాబుకు విజయవాడ ఎంపీ కేశినేని నాని సవాల్



చంద్రబాబునాయుడికి దమ్ము, ధైర్యం ఉంటే విజయవాడ ఎంపీ స్థానం నుంచి తనపై నిలబడి గెలవాలని వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేశినేని నాని సవాల్ విసిరారు. చంద్రబాబు కుప్పంలో కూడా ఓడిపోవడం ఖాయమన్నారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తోటమూల మ్యాంగో మార్కెట్‌లో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ మండల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు తెలుగుదేశం పార్టీకి చివరివని జోస్యం చెప్పారు. పేదల కోసం పనిచేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే, పేదలకు వ్యతిరేకంగా పాలన చేసిన ఘనుడు నారా చంద్రబాబునాయుడని అన్నారు. తన పుత్రరత్నం లోకేశ్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్న ఏకైక అజెండాతో చంద్రబాబు ముందుకు పోతున్నారని విమర్శించారు. సుదీర్ఘ రాజకీయం ఉన్న వ్యక్తినని చెప్పుకొనే చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్‌లో కనీసం ఇల్లు కూడా లేదని ఎద్దేవా చేశారు. అమరావతి పేరిట ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు నష్టం తెచ్చారన్నారు. రూ.2.60 లక్షల కోట్ల మేర సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసిన ఘనత దేశంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందని పేర్కొన్నారు. అభ్యర్థుల డబ్బు చూసి చంద్రబాబు టికెట్లు కేటాయిస్తున్నారని విమర్శించారు. మండలంలో ప్రధాన సమస్య అయిన కట్టెలేరు వంతెన నిర్మాణానికి వచ్చే నెల 3వ తేదీన శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. తిరువూరు నియోజకవర్గంలో 10వేల మెజారిటీతో పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలన్నారు.



# అదే జరిగితే.. మూడో ప్రపంచ యుద్ధమే: జెలెన్‌స్కీ

రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ తరుణంలోనే జర్మనీ పర్యటనలో ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా, జర్మనీ సహా అనేక దేశాలు తమకు మద్దతుగా నిలుస్తున్న నేపథ్యంలో ఏమైనా జరగొచ్చని వ్యాఖ్యానించారు. ఒకవేళ నాటో కూటమిలోని సభ్య దేశంపై రష్యా దాడి చేస్తే.. అది మూడో ప్రపంచ యుద్ధానికి నాందిగానే భావించాల్సి ఉంటుందన్నారు.



# తిరుపతి ఎంపీ అభ్యర్థిగా నిహారిక?

ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు కసరత్తు కొనసాగుతోంది. తిరుపతి లోక్ సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అంగలకుర్తి నిహారిక పేరు ఖరారైనట్టు సమాచారం. ఈమె సత్యవేడు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ తలారి మనోహర్ చిన్న కోడలు కూడా. నిహారిక అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశముంది.




# సికింద్రాబాద్ లో దారుణం.. గొంతు కోసి చంపేశారు

సికింద్రాబాద్ మోండా మార్కెట్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఇద్దరు యాచకులపై గుర్తు తెలియని దుండగులు దాడులకు దిగారు. ఇందులో ఓ యాచకుడిని అత్యంత దారుణంగా గొంతు కోసి చంపగా.. మరో యాచకుడిని సైతం హత్య చేసేందుకు యత్నించారు. యాచకుల వద్ద ఉన్న డబ్బును దుండగులు అపహరించారు. ముగ్గురు వ్యక్తులు కత్తులతో దాడి చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# ఏపీ మంత్రివర్గ భేటీపైనే అందరి దృష్టి

ఈ నెల 31వ తేదీన ఏపీ మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఎన్నికలకు ముందు నిర్వహించే ఈ సమావేశంపై అందరి దృష్టి పడింది. బహుశా ఈ మంత్రివర్గానికి ఇదే చివరి సమావేశం కూడా కావొచ్చు. ఎందుకంటే ఆ తర్వాత ఎన్నికల ప్రకటన విడుదల అయ్యే అవకాశం ఉంది. చివరి మంత్రివర్గ సమావేశంలో సీఎం జగన్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ప్రజలను ఆకర్షించుకునేందుకు తాయిలాలు ఏమైనా ప్రకటిస్తారా..వేచి చూడాల్సిందే.



# సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను కాల్చి చంపిన బాయ్ ఫ్రెండ్

హోటల్ గదిలో ప్రియురాలిని తుపాకీతో కాల్చి చంపాడు ప్రియుడు. ఈ ఘటన మహారాష్ట్ర పుణెలోని ఓయో టౌన్ హౌస్ హోటల్‌లో శనివారం చోటు చేసుకోగా, ఆలస్యంగా వెలుగు చూసింది. సమాచారం అందుకున్న పోలీసులు హోటల్ వద్దకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రిషబ్ నిగమ్‌ను ముంబైలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలిని వందన ద్వివేదిగా గుర్తించారు. పుణెలోని హింజవాడిలోని ఓ ఐటీ సంస్థలో వందన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. రిషబ్ యూపీ రాజధాని లక్నోకు చెందినవాడు. వీరిద్దరూ గత పదేండ్ల నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. వందనను కలిసేందుకు రిషబ్ జనవరి 25న పుణెకు వచ్చాడు. ఇద్దరూ కలిసి హింజవాడిలోని ఓయో టౌన్ హౌస్ హోటల్‌లో రూమ్‌ను బుక్‌ను చేసుకున్నారు. అయితే వందనను చంపేందుకు పక్కా ప్రణాళికతో రిషబ్ లక్నో నుంచి పుణె వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వందన ప్రవర్తనపై రిషబ్ అనుమానం పెంచుకున్నట్లు పేర్కొన్నారు. ఇక వందనను చంపిన అనంతరం శనివారం రాత్రి 10 గంటలకు హోటల్ నుంచి రిషబ్ వెళ్లిపోయినట్లు అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయింది.